
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్ : 4.40 (బుధవారం)
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 , కనిష్ఠం 24.0

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న రాజకీయ వేడి
- కరువుపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- మంత్రులు, మాజీ మంత్రుల నడుమ పరస్పర ఆరోపణల యుద్ధం



మాటల మంటలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ నాయకులు మాటల మంటలు రేపుతున్నారు. కరువుకు బాధ్యత మీదంటే మీదేనంటూ ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. అటు మంత్రులు, ఇటు ప్రతిపక్ష నేతల మాటలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ సీఎం కేసీఆర్ పర్యటన, ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ జిల్లాకు రావడంతో బీఆర్ఎస్ నుంచి మొదలైన విమర్శలపై మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమారెడ్డిలతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ప్రతిస్పదించారు. సాగర్‌లో నీటి నిల్వల నుంచి మొదలు ఫోన్‌ట్యాపింగ్ వరకు ప్రతీ అంశంపై ధీటుగా ఆరోపణ, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు మరింత దగ్గరయ్యే నాటికి మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది.

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల ప్రచారం షురూ అవడంతో జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లాపైనే ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ దృష్టి సారించడంతో జిల్లాకు చెందిన ఇరు పార్టీల నేతల నడుమ మాటల యుద్ధం సాగుతోంది. జిల్లాలో ఎండిన పంట పొలాలను ఆదివారం పరిశీలించిన మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై సీరియస్‌గా విమర్శలు చేస్తే, సోమవారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకడుగు ముందుకేసి తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

మంత్రులు, మాజీల నడుమ మాటల తూటాలు

మరోవైపు విద్యుత్ కోతలపైనా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి, మాజీ మంత్రి కేటీఆర్‌కు మధ్య మాటల యుద్ధం సాగింది. కరెంటు కోతలు లేవని, ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కట్టుకథలు అల్లుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అంటే, మంత్రి ఉత్తమ్ బుకాయిస్తున్నారని, కానీ కోతల్లేవని రైతుల వద్దకు వచ్చి చెప్పగలరా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. తన ఫోన్‌ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందని తాజాగా మంత్రి ఉత్తమ్ పేర్కొనడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బాధితులు ఇంకా ఎవరెవరు బయటకు వస్తారోననే ఆసక్తి నెలకొంది. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డికి నడుమ తీవ్రస్థాయిలో ఆరోపణలు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వ హ యాంలో సాగర్ నీళ్ల చివరి ఆయకట్టు వరకు ఇప్పించామని, దిగువకు నీళ్ల వెళ్తున్న సమయాల్లోనూ జిల్లా రైతాంగానికి సాగు నీరిప్పించామని, ఇప్పుడు కాల్వ కట్టలమీద పోలీసు బందోబస్తుతో దిగువకు నీళ్ల తీసుకెళ్తుంటే మంత్రి కోమటిరెడ్డి ఎందుకు కాల్వల మీదకు రావడం లేద ని మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి నిలదీశారు. రైస్‌మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నందునే ధాన్యానికి ధరలు తగ్గించినా మిల్లర్లపై చర్యలు తీసుకోలేకపోతున్నార ని ఆరోపించారు. మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి గతప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, విద్యుత్ మంత్రిగా దోపిడీకి పాల్పడ్డారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలు గుప్పిస్తుంటే, మరోవైపు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సైతం జగదీ‌ష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. మొత్తంగా ప్రజాసమస్యలు, కరువు, విద్యుత్ కోతలు, అవినీతి అంశాలపై రెండుపార్టీల నడుమ, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే ల నడుమ సాగుతున్న మాటల యుద్ధం లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చేసరికి ఇంకా ఏ స్థాయికి చేరుతుందోనని, ఇంకా ఏస్థాయి ఆరోపణలు వినిపిస్తాయోనని రాజకీయవర్గాల్లో చర్చ మొదలైంది.

కరువుకు మీరే బాధ్యులంటే మీరే బాధ్యులని ఆరోపణలు

ఉమ్మడిజిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో పంటలు ఎండిపోయి రైతాంగం నష్టపోవడానికి మీరంటే మీరే కారణమని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ఆదివారం జిల్లాలో పర్యటించిన మాజీ సీఎం కేసీఆర్ ఈ కరువు కాంగ్రెస్ అసమర్థత వల్లే వచ్చిందని దుయ్యబట్టారు. ఇటు నాగార్జునసాగర్‌లో, అటు కాళేశ్వరంలో నీళ్లున్నా తెలివితక్కువతనంతో, అవగాహన రాహిత్యంతో నీళ్లివ్వకపోవడం వల్లే కరువు ప్రబలిందని ఆరోపించారు. పంటనష్టానికి కాంగ్రెస్‌దే బాధ్యతని, పంటనష్టం ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ వెంటపడతామని హెచ్చరించారు. అయితే కరువుకు గత కేసీఆర్ ప్రభుత్వ పాలనే కారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఆయన చేసిన పాపాలు, అన్యాయాల వల్లే ఈ దుస్థితి దాపురించిందని, గత పదేళ్లలో రాయి, రప్ప, ఇసుక దేన్నీ వదలకుండా దోచుకున్నారన్నారు. కేఆర్ఎంబీ సాకుతో సాగర్‌లో 14 టీఎంసీల నీరు తీసుకునే అవకాశమున్నా తీసుకోలేకపోయారని, ఇది ఈ ప్రభుత్వ అసమర్థతని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుని అప్పగించేందుకు అంగీకరించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రులు ఆరోపిస్తున్నారు.



అసమర్థ కాంగ్రెస్

ప్రభుత్వంతోనే కరువు

- నల్లగొండలో మాజీ మంత్రి కేటీఆర్

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పంటలు ఎండిపోయాయని, తాగునీరు కూడా దొరకడం లేదని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సోమవారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామంలో రైతులు గన్నెబోయిన మల్లయ్య, బోర్ల రాంరెడ్డిలను కలిసి కరువు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ నాటి తెలంగాణ రైతుల దుస్థితికి అవస్థలకు బోర్ల రాంరెడ్డి చిహ్నంగా నిలిచారని ఆయన దీన పరిస్థితిని కేసీఆర్ 100సార్లు చెప్పారని గుర్తుచేశారు. రాంరెడ్డి పేరు బోర్ల రాంరెడ్డిగా మారిందన్నారు. కేసీఆర్ పర్యటనతో భయపడిన ప్రభుత్వం నంది పంప్‌హౌజ్‌లో నీళ్ల ఎత్తిపోసి కరీంనగర్‌కు నీళ్ల వదిలిందన్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు సాగర్ నుంచి టెయిల్‌పాండ్ దాకా సాగునీరు అందిందన్నారు. ఇప్పటివరకు సీఎంతో పాటు మంత్రులు రైతులను పరామర్శించ లేదన్నారు. ప్రధానప్రతిపక్షంగా కేసీఆర్ తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా జిల్లాలో పర్యటించి రైతులకు ధైర్యం చెబుతున్నాడన్నారు. వీడియోలో రైతు మల్లయ్య కష్టాలను చూసి చలించిపోయి ముశంపల్లి గ్రామానికి వచ్చానన్నారు. ఈ సందర్భంగా రైతు మల్లయ్య కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు.

రెట్టింపు ఉత్సాహంతో పోరాడాలి : కేటీఆర్

గత ఎన్నికల్లో ఓటమితో బాధపడకుండా నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినా తాము ప్రచారం చేసుకోలేకపోయామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పేలా నల్లగొండ ఎంపీ స్థానాన్ని గెలుస్తామన్నారు.

ప్రజలు నిలదీస్తారనే కాంగ్రెస్ దొంగ డ్రామాలు: మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ఆ కేసులు, ఈ కేసులు అంటూ దొంగ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయిలేదని అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్‌కు అలవాటు అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 110రోజుల సమయం ఇచ్చినా పాలనలో మార్పు రాకపోవడంతో మాజీ సీఎం కేసీఆర్ రైతులను ఓదార్చేందుకు వచ్చారన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రభుత్వం: ఎంపీ బడుగులు



రాష్ట్రాన్ని దుర్మార్గమైన ప్రభుత్వం పాలిస్తుందని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రజలు అనుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరుగుడే సరిపోయిదని, ప్రజా సమస్యలు ఆయనకు పట్టడం లేదన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతారని ఆయన ఎప్పుడు ఏంమాట్లాడుతారో ఆయనకే తెలియదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శరణ్యమని పేర్కొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇస్తే పార్లమెంట్‌లో పోరాడుతా



తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని సమస్యలపై పార్లమెంటులో పోరాటం చేస్తానని నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. 2014 ముందు తెలంగాణ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబడి ఉండేదని, సీఎం కేసీఆర్ సీఎం అయిన తర్వాత రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. కేసీఆర్ మాదిరిగానే తనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని రైతుల కష్టాలను తాను దగ్గర ఉండి చూశానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందడంతో చత్తీస్‌ఘడ్ నుంచి కూలీలు వచ్చి ఇక్కడ నాట్లు వేస్తున్నారని తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్యలను నివారించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

పాల్గొన్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : ప్రత్యేక కార్యాచరణతో వేసవిలో తాగునీటి సమస్యలను నివారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. వేసవిలో మంచి నీటి సరఫరా, యాసంగి ధాన్యం కొనుగోళ్లు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఎస్ వెంకటరావు, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో మాట్లాడారు. తాగునీరు సమస్య తలెత్తకుండా మండల స్థాయిలో ఎంపీడీవోలు, గ్రామస్థాయిలో కార్యదర్శులు నిత్యం పర్యవేక్షణ చేయాలని సీఎస్ ఆదేశించారు. తాగనీటి సమస్య నివారణ కోసం చేతిపంపులను, బోర్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, సీఎంఆర్‌ను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌రాజు, జడ్పీ సీఈవో అప్పారావు, డీఎ్‌సవో మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో కోటాచలం, డీఈవో అశోక్, సీపీవో కిషన్‌రావు, మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాసరావు, అరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధులు, బాధ్యతలు పారదర్శకంగా ఉండాలి

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 1: జిల్లాలో ఎన్నికల విధులు, బాధ్యతలు పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈవీఎం యంత్రాల పనితీరుపై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల్లో పీవో, ఏపీవోలు రోజువారీగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,416మంది పీవో, ఏపీవోలకుగాను మొదటిరోజు శిక్షణకు 1,188 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవ్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, డీఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

తుంగతుర్తి, ఏప్రిల్ 1 : సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పీవోలకు, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాక్ పోల్ నిర్వహణ, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల ఉపయోగంతో పాటు ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, అమీన్‌సింగ్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ అధికారులు పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

కృష్ణానదిలో జోరుగా ‘మట్టి’ దందా

- ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకోవటంతో దందాకు అవకాశం
- ఉప వాగులకు తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం





కృష్ణానదిలో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 1 : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ భాగాన కృష్ణానదిలో అక్రమంగా మట్టి రవాణా దందా జోరుగా సాగుతోంది. నదిలో పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు, వందల సంఖ్యలో టిప్పర్ల సహాయంతో నదీ గర్భాన్ని తవ్వి అక్రమార్కులు అటవీ భూములకు, అసైన్డ్ భూములకు, ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. మామూళ్ల మత్తులో స్థానిక అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకోవటంతో ఈ దందా ప్రారంభమైంది. పులిచింతల ప్రాజెక్టు ఎగువన నీటి కొరతతో డెడ్‌స్టోరేజీకి చేరుకోవటంతో నెమలిపురి గ్రామం నుంచి చింతలపాలెం మండల కేంద్రం, వెల్లటూరు, చింత్రియాల, గుళ్లపల్లి వరకు దాదాపు 15 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ చూసినా ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లతో అక్రమ క్వారీలు ఏర్పాటుచేసి, రాత్రీ పగలు నిరంతరాయంగా మట్టిని తరలిస్తున్నారు.

ఉపవాగులపై రవాణాకు అనుకూలంగా మట్టి మాఫియా తాత్కాలికంగా బ్రిడ్జిలు ఏర్పాటు చేసింది. నదీ గర్భంలోనే రోడ్లు వేసుకుని డీఫారెస్టు భూభాగంలో అక్రమంగా మట్టిని తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వందల సంఖ్యల తరలిస్తోంది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

కృష్ణానదిలో అక్రమంగా మట్టి దందా కొనసాగుతుందని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉండటంతో అధికారుల సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు దాడులు చేసే సమయంలో కొందరు కిందిస్థాయి ఉద్యోగులు దాడుల విషయాన్ని ముందుగానే అక్రమార్కులకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటు ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో దాడులు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అప్పుడే మట్టి అక్రమ రవాణాకు చెక్‌పడుతుందన్నారు.

పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం

పులిచింతల ప్రాజెక్టు ఎగువన అక్రమ తవ్వకాలపై స్థానికరెవెన్యూ, పోలీస్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాం. అక్రమంగా మట్టి తరలించే వారిపై పోలీసులే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. అక్రమ తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలి.
- కిషోర్, ఎస్ఈ, పులిచింతలప్రాజెక్టు

టిప్పర్లను సీజ్ చేశాం

అక్రమంగా కృష్ణానదిలో మట్టి తవ్వకాలపై అనేక దాడులు నిర్వహించాం. కొన్ని టిప్పర్లను సీజ్ చేశాం. మరికొన్నింటిపై కేసులు నమోదు చేశాం.
- సురేందర్‌రెడ్డి, తహసీల్దార్

అధికారులు కోరితే రక్షణ కల్పిస్తాం

కృష్ణానదిలో మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రభుత్వ అధికారులు దాడులు చేస్తే వారికి రక్షణ కల్పిస్తాం. దాడుల సమయంలో రెవెన్యూ, ఫారెస్ట్, ప్రాజెక్టు అధికారులు తమను సంప్రదించాలి.
- సైదిరెడ్డి, ఎస్ఐ

తిరుమలగిరి మార్కెట్‌కు 20వేల బస్తాల ధాన్యం

ఈ ఏడాది యాసంగిలో తొలిసారి పెద్దసంఖ్యలో రాక

మార్కెట్‌కు మంగళవారం సెలవు ప్రకటించిన అధికారులు



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన ధాన్యం

తిరుమలగిరి, ఏప్రిల్ 1: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం భారీ స్థాయిలో ధాన్యం వచ్చింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వరి కోతలు ప్రారంభంకాగానే సోమవారం మార్కెట్‌కు తొలిసారి 20,488 బస్తాల్లో 13,111క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు తీసుకువచ్చారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ రూ.2,183, సాధారణ రకం రూ.2,203 ప్రకటించారు. మార్కెట్‌కు ఐఆర్- 64రకం 19,650 బస్తాల్లో 12576 క్వింటాళ్ల ధాన్యం రాగా, గరిష్ఠ ధర రూ.1997, కనిష్ఠ ధర రూ.1620 నమోదైంది. ఆర్ఎన్ఆర్ రకం 603బస్తాల్లో 385క్వింటాళ్ల ధాన్యం రాగా, గరిష్ఠ ధర రూ.2,139, కనిష్ఠంగా రూ.2,002 పలికింది. ఎస్ఎం రకం 235బస్తాల్లో, 150 క్వింటాళ్ల రాగా, గరిష్ఠ ధర రూ.2,039, కనిష్ఠ ధర రూ.1,920 నమోదైనట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. మార్కెట్‌కు అధిక ధాన్యం వచ్చినందున వ్యాపారుల కోరిక మేరకు మార్కెట్‌కు మంగళవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి తెలిపారు. బుధవారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా కొనుగోళ్ల జరుగుతాయని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

గర్భిణులకు అల్ట్రా స్కానింగ్ పరీక్షే
- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు
7లో
బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరల పెంపు
మునగాలలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆధ్యాత్మికతతో ప్రశాంతమైన జీవితం



మైహోం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న చినజీయర్ స్వామి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 1: ఆధ్యాత్మికతతో ప్రతీ మనిషి ప్రశాంతమైన, శాంతివంతమైన జీవితాన్ని పొందుతారని త్రిదండి శ్రీమన్నారాయణ, రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని మైహోం పరిశ్రమ ప్రాంగణంలోని శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. చినజీయర్‌స్వామితో పాటు అహోబిల రామానుజ జీయర్‌స్వామి కల్యాణోత్సవాన్ని పర్యవేక్షణలో అర్చకులు కన్నుల పండువగా కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ స్వామి వారి కల్యాణం, స్వామి వారి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల ద్వారా భక్తులకు దైవచింతన పెరుగుతుందన్నారు.

ఇదిలా ఉండగా శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి భక్తులకు అందజేశారు. కల్యాణం అనంతరం పరిశ్రమలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు బంగారు పతకాలతో చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కుటుంబసభ్యులు, కంపెనీ ప్రతినిధులు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందువు, కంపెనీ ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు



పదవీవిరమణ పొందిన కానిస్టేబుల్ జార్జ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 1: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 30, 30(ఏ) పోలీస్‌యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేనిదే జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు, సభలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా, ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు.

విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు మరువలేనివి

సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖలో వివిధ హోదాలో పనిచేసి విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు మరువలేనివని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానించి, మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఏడు అర్జీలు

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణిలో ఏడు అర్జీలు అందాయని ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. అర్జీదారులతో ఆయన మాట్లాడారు. అర్జీలను తక్షణమే పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

హరిహరులకు విశేష పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మ వార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 41,93,233ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్టలో సంప్రదాయ దుస్తుల పట్టింపేదీ?

ఆలయాల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం వెల్లివిరిసేందుకు కొన్ని నిబంధనలు అమలుచేస్తారు. పుణ్యక్షేత్రాల్లో ఇవి పాటించడానికి భక్తులు కూడా సహకరిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనానికే కాకుండా సాధారణ దర్శనానికి కూడా డ్రెస్‌కోడ్‌ను భక్తులు తప్పనిసరిగా పాటించే నిబంధన ఉంది. యాదగిరిగుట్టలో నిత్యం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు బ్రేక్ దర్శనం ఉంటుంది. రూ.300 టికెట్ కొనుగోలుచేసి భక్తులు ఈ అవకాశం పొందే సౌకర్యం ఉంటుంది. ఈ టికెట్ ద్వారా 10ఏళ్లలోపు ఉన్న పిల్లలు మినహా భక్తులు నేరుగా అంతరాలయంలో స్వామిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. కొంతమంది భక్తులు వివిధ రకాల అధునిక(ఫ్యాషన్) దుస్తులతో ప్రధానాలయంలోకి వెళ్లి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. డ్రెస్‌కోడ్ అంశంపై ఈవో భాస్కర్‌రావు స్పందిస్తూ ఇప్పటికిప్పుడు మార్పులు చేయలేమని. ప్రభుత్వం, దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు అమలుచేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

చివ్వేంల, ఏప్రిల్ 1: సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలంలోని తిర్మలగిరి గ్రామ సీనియర్ పంచాయతీ కార్యదర్శి నూకల కోటిరెడ్డికి వల్లభాపురం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలగిరి గ్రామంలో విధులు ముగించుకొని సూర్యాపేటకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ సమీపంలో జాతీయరహదారి-65పై కోటిరెడ్డి ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డికి తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

గర్భిణులకు అల్ట్రా స్కానింగ్ పరీక్షే

- డయాగ్నోస్టిక్ హబ్‌లో స్కానింగ్ కోసం పడిగాపులు
- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న గర్భిణులు, రోగులు
- డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేసినా అవస్థలే



భువనగిరిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1: తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువు ఆరోగ్యాన్ని వైద్యులు తెలుసుకునేందుకు ఏకైక మార్గం అల్ట్రాస్కానింగ్. అంతేకాక కడుపునొప్పితో బాధ పడేవారికి, రోడ్డు ప్రమాద బాధితులతో పాటు అవసరమైన వారందరికీ ఏ తరహా చికిత్స అందించాలో తెలుసుకునేందుకు అల్ట్రా స్కానింగ్ పరీక్ష చేస్తారు. బాధితులందరికీ ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు అందించేందుకు ఏడాది క్రితం భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేశారు. పలు రకాల రోగనిర్ధారణ పరీక్షలతో పాటు అల్ట్రా స్కానింగ్‌ను కూడా ప్రారంభించారు. మెజార్టీ పరీక్షల నిర్వాహణలో కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ అల్ట్రా స్కానింగ్ పరీక్షలు మాత్రం గర్భిణులతో పాటు అం దరికీ పరీక్ష పెడుతోంది. గర్భిణీకి 3వ, 7వ, 9వ నెలలో స్కానింగ్ చేసి పిండస్థ శిశువుతో పాటు తల్లి ఆరోగ్యా న్ని అంచనా వేస్తారు. దీంతో జిల్లా ఆస్పత్రిలోని టి హబ్‌కు ప్రతీ సోమవారం, గురువారం సుమారు 100 మందికి పైగా, సాధారణ రోజుల్లో సుమారు 25మంది గర్భిణులు, అదనంగా మరో 30 మంది వరకు రోగులు స్కానింగ్ కోసం వస్తుంటారు. వెంటనే స్కాన్ చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిన బాధ్యత టి హబ్ నిర్వాహకులది. కానీ వెంటనే చేయాల్సిన స్కానింగ్‌కు 10రోజుల వాయిదా ఇస్తుండడం టి హబ్ నిర్వాహకులకు అలవాటుగా మారింది. విధిలేని పరిస్థితుల్లో పలువురు యథావిధిగా ప్రైవేట్ ల్యాబ్‌లనే ఆశ్రయిస్తున్నారు.

రోజుకు 45 మందికి

టీ హబ్ ప్రొటోకాల్ ప్రకారం అర్హులైన ఇద్దరు అల్ట్రాసౌండ్ స్కానింగ్ టెక్నిషియన్స్, వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఒకే ఒక్క టెక్నిషియన్ మాత్రమే ఉన్నాడు. దీంతో రోజు తప్పించి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 45మందికి మాత్రమే అల్ట్రా స్కానింగ్ తీస్తున్నారు. దీంతో స్కానింగ్ కోసం వచ్చే వారికి వాయిదా తేదీలను ఇవ్వాల్సి వస్తున్నదని అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం అన్ని పని దినాల్లో స్కానింగ్ చేసి వెంటనే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించని సిబ్బంది స్కానింగ్ కోసం వచ్చే వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది రోజుల వాయిదా తేదీ ఇచ్చారు



కడుపునొప్పితో సోమవారం భువనగిరి జిల్లా ఆస్పత్రికి వెళ్లా. ఓపీ డాక్టర్ స్కానింగ్ రాయడంతో టిహబ్‌కు వెళ్లాను. అక్కడ పెద్ద సంఖ్యలో గర్భిణులు స్కానింగ్ కోసం ఎదురుచూస్తుండగా స్కానింగ్ చేసే సిబ్బందే లేరు. పైగా గర్భిణులతో సిబ్బంది వాగ్వాదం చేస్తున్నారు. కడుపు నొప్పితో వెళ్లిన నన్ను స్కానింగ్ కోసం ఈ నెల 9న రావాలని వాయిదా తేదీ ఇచ్చారు. నేను గట్టిగా మాట్లాడడంతో అత్యవసరంగా టెక్నిషియన్‌ను పిలిపించి స్కానింగ్ పూర్తి చేశారు. ఈ తరహాలో టీ హబ్‌ను నిర్వహిస్తే రోగులు ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టపోయే పరిస్థితి.

- సుధాకర్, బేకుల సోమారం. వలిగొండ మండలం.

గర్భిణులందరికీ స్కానింగ్ చేస్తున్నాం



గర్భిణులందరికీ సక్రమంగానే స్కానింగ్ చేస్తున్నాం. అత్యవసరం కాని ఇతరులకు మాత్రమే వాయిదా తేదీల ను ఇస్తున్నాం. టీహబ్ నిర్వాహణలో పూర్తిస్థాయి నిబంధనలు పాటిస్తున్నాం. ఎవరికీ ఇబ్బం ది కలగకుండా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సిబ్బంది ఖాళీలతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ మేరకు పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

- డాక్టర్ చిన్నా నాయక్, భువనగిరి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్.

పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలి ఆత్మహత్య


పావని(ఫైల్)

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భువనగి రిలోని కుమ్మరివాడలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉండే రాంపల్లి పావని(24) తమ సమీప బంధువులైన నార్కట్‌పల్లి మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన మండల శ్రవణ్‌తో ప్రేమలో పడింది. ఇద్దరు చాలా రోజులుగా సన్నిహితంగా ఉంటు న్నారు. పావనిని పెళ్లి చేసుకోవాలని అడిగేందుకు ఆమె తల్లిదండ్రులు భూపాల్, పద్మ ఇటీవల శ్రవణ్ ఇంటికి వెళ్లారు. శ్రవణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు వారితో అసభ్యంగా మాట్లాడి పెళ్లికి నిరాకరిం చారు. దీంతో మనస్తాపానికి గురైన పావని ఇంట్లో ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స అనంతరం కోలుకుంది. శ్రవణ్ గత నెల 27వ తేదీన ఇంట్లో మోతాదుకు మించి నిద్రమాత్రలు మింగటంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పావని 28వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 31వ తేదీ రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం సాయంత్రం మోటకొండూరు మండలం కదిరేనిగూడెం స్వగ్రామానికి తీసుకువెళ్లారు. పావని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మండల శ్రవణ్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రవణ్ బయటకు వచ్చిన అనంతరం అరెస్టు చేస్తామని ఎస్ఐ అరుణ్ తెలిపారు.

మా డబ్బులు మాకివ్వండి

● సాగర్ పైలాన్ కాలనీలో పోస్ట్‌మాస్టర్ బాధితుల ధర్నా ● నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఘటన



పైలాన్‌కాలనీ పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1: తాము జమ చేసుకున్న డబ్బులు మాకివ్వండి అని పోస్టాఫీస్ ఖాతాదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని పోస్టాఫీస్‌కు తాళం వేసి ధర్నా నిర్వహించారు. సాగర్ పైలాన్ కాలనీ పోస్టాఫీస్‌లో సబ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించిన రామకృష్ణ ఖాతాదారులు దాచుకున్న సొమ్మును రూ.2కోట్లు సొంత ఖాతాలకు మళ్లించుకున్నాడు. గత ఏడాది డిసెంబర్ నెలలో గుర్తించిన ఖాతాదారులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహించి సొంత ఖాతాలకు నగదు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. అదే నెలలో రామకృష్ణ పోలీసులకు లొంగిపోగా, ప్రస్తుతం నల్లగొండ జిల్లా జైలులో ఉన్నాడు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు అవుతున్నా తమకు నగదు రికవరీ చేయలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పలువురు బాధితులు పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నగదు రికవరీ చేయించాలని పోస్టల్ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు కూడా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయమై దేవరకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఖాతాదారుల నగదును సొంతంగా వాడుకోవడంపై విచారణ కొనసాగుతోందని, ఖాతాదారుల రికార్డుల నమోదు పూర్తయిందని తెలిపారు. సొమ్ము కాజేసిన సబ్ పోస్టుమాస్టర్ రామకృష్ణ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపించి త్వరలో ఖాతాదారులకు నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంటసేపు తర్వాతపోస్టాఫీస్ తాళం తీయడంతో పోస్ట్‌మాస్టర్ రంగయ్య విధులు నిర్వర్తించారు.

మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన


పద్మారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


పద్మారెడ్డి(ఫైల్)

భువనగిరి రూరల్, ఏప్రిల్ 1: పశువులు తన పొలంలో మేస్తున్నాయని రైతు సంబంధిత పశువుల యజమానులపై ఆగ్రహిం చాడు. దీంతో వారు గత నెల 19వ తేదీన రైతుపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తి గ్రా మంలో జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన ఎలిమినేటి పద్మారెడ్డి(60) వ్యవసాయం పొలంలో అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన గేదెలు గత నెల 19వ తేదీన గడ్డి మేస్తుండడంతో, వరి పొలాన్ని నష్టం చేస్తున్నాయని పద్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశాడు. దీంతో మేడబోయిన సత్తయ్య, అతని భార్య వీరమణి, కుమారులు బాల మల్లేష్, గోపి కృష్ణ పొలంలోనే పద్మారెడ్డిపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. అడ్డువెళ్లిన పద్మారెడ్డి భార్య కమలమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డిలను కూడా గాయపర్చారు. వెంటనే వారందరినీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సత్తయ్య, బాల మల్లేష్, గోపి కృష్ణలను మార్చి 26న అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. పద్మారెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పద్మారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిపై హత్యా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వడపర్తి గ్రామంలో ఉద్రిక్తత

పద్మారెడ్డిపై దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు సత్తయ్య కుటుంబీకులు కొత్తగా నిర్మిస్తున్న ఇంటిలోపల మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ బాధితులను సముదాయించారు. దాడి చేసిన నలుగురు కుటుంబ సభ్యులపై హత్యా నేరం కేసు నమోదు చేశామని, ఈ నెల 26న మేడబోయిన సత్తయ్య, అతని కుమారులు బాలమల్లేష్, గోపి కృష్ణలను కోర్టులో రిమాండ్ చేశామని, సత్తయ్య భార్య వీరమణిపై కూడా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తానని చెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం గ్రామంలో పద్మారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

రూ.90 లక్షల విలువైన బంగారం, వెండి పట్టివేత

● ఉమ్మడి జిల్లాలో రూ. 3.59లక్షల నగదు పట్టివేత



టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద బంగారం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సూర్యాపేటరూరల్, పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, కోదాడ రూరల్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో సోమారం వాహనాల తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో 1,135 గ్రాముల బంగారం, 17కిలోల 99 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు. వీటి విలువ రూ. 90,31,038 ఉంటుందని పోలీసులు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రూ.2.39 లక్షల నగదు పట్టుకున్నట్లు చింతపల్లి ఎస్ఐ బి. యాదయ్య తెలిపారు. గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన చిత్రియాల సైదారావు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన ఎల్లబోయిన నాగరాజు నగదు తీసుకెళ్తుండగా అందుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి నల్లగొండలోని డీటీవో సేఫ్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం చెక్‌పోస్టు వద్ద విజయవాడ నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కారులో రూ. 65 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కారులో నగదు తీసుకెళ్తుండగా నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో ఆ నగదును ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలం శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి కోదాడకు కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ. 55 వేల నగదును గుర్తించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం : కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేట జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, నగలు, సామాగ్రి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో ఆధారాలు చూపితే తిరిగి ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.17కోట్ల నగదు, 7,403 లీటర్ల మద్యం (విలువ రూ. 29.35లక్షలు)తోపాటు 10వాహనాలు (విలువ రూ. 2.32లక్షలు), బంగారం ఇతర ఆభరణాల విలువ రూ.23.32 లక్షలు, ఇతర వస్తువుల విలువ రూ.70.28లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం రూ.2.43కోట్లు లక్షలు విలువ ఉంటాయని వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



భువనగిరి రూరల్, ఏప్రిల్ 1: భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏరియా ఆస్పత్రి ఆవరణలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఎండీ. సమీరొద్దీన్ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు గీతల టీ షర్ట్, బూడిద కలర్ పాయింట్ ఉంది. ఐదు రోజుల నుంచి ఆస్పత్రి సమీపంలో తిరుగుతున్నాడని, అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లాకేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8712662471లో సంప్రదించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ కోరారు.

ఇంట్లో చోరీ.. బంగారు ఆభరణాలు అపహరణ

ఆలేరు రూరల్, ఏప్రిల్ 1: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని బహద్దూర్‌పేటలోని ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధమల్ల లత శనివారం సాయంత్రం జనగామ జిల్లా సింగరాజుపల్లిలోని తమ సమీప బంధువుల ఇంట్లో జరుగుతున్న వేడుకలకు వెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని చొరబడ్డారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసుకోగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందజేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారంతో పాటు 25తులాల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ విషయమై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై..

వలిగొండ, ఏప్రిల్ 1: మద్యానికి బానిసైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వీరవెల్లి మదిరగ్రామం కమ్మగూడేనికి చెందిన సీహెచ్ లాజర్(50) వృత్తిరీత్యా వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై కుటుబ సభ్యులతో గొడవ పడి వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామ పరిధి 21/13-14 మైలు రాయి వద్ద గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న రైలుకు సోమవారం ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ సుధాకర్ నల్లగొండ రైల్వేస్టేషన్‌కు సమాచారం చేరవేశాడు. భువనగిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని భువనగిరి మార్చురీకి తరలిస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. లాజర్‌కు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

జవహర్ నవోదయ పరీక్ష ఫలితాలు విడుదల

పెద్దవూర, ఏప్రిల్ 1: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6, 9వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో తాత్కాలికంగా ఎంపికైన 79మంది విద్యార్థుల వివరాలతోపాటు 9వ తరగతిలో ఎంపికైన ఏడుగురు విద్యార్థుల వివరాలు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ https://navodaya.gov.in/nvs/nvsschool/NALGONDA/en/home లోఅడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం పాఠశాలకు రావాలని ఆయన సూచించారు.

బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరల పెంపు

● కెమెరా వినియోగిస్తే రూ.25, వీడియో కెమెరా రూ.10వేలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1: అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరలు ఈ నెల 1వ తేదీ నుంచి పెంచినట్లు బుద్ధవనం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధరలు పెద్దలకు రూ.100(గతంలో 50), 12సంవత్సరాలలోపు పిల్లలకు రూ.50(గతంలో రూ.30), విదేశీ పర్యాటకులకు రూ. 300లుగా నిర్ణయించారు. ఫోటో కెమెరాను ఉపయోగించినట్లయితే రూ. 25లు, ఒక రోజు వీడియో కెమెరాను వినియోగిస్తే రూ. 10వేలు, కాన్ఫరెన్స్ హాలుకు ఒకరోజుకు రూ. 10వేలుగా ధరలు నిర్ణయించారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల లెటర్ ప్యాడ్‌లను తీసుకువస్తే టికెట్ ధరలో 50శాతం రాయితీని కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మాంక్‌లు, బౌద్ధ భిక్షువులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారుల విచారణ

కోదాడ రూరల్, ఏప్రిల్ 1: సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ప్రభుత్వం సరఫరా చేసే కుక్కకాటు, పాముకాటు మందులను కొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని కొందరు ఇటీవల వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఆస్పత్రిలో పనిచేసే కొందరు సిబ్బంది ఖరీదైన మందులైన కుక్కకాటుకు సంబంధించిన రేబిస్ ఇంజెక్షన్, పాముకాటుకు సంబంధించిన ఇంజెక్షన్‌ను బయటి మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు లేవని చెప్తున్నారని పలువురు రోగులు ఆరోపించారు. దీంతో ఆసుపత్రిలో వైద్యవిధాన పరిషత్ అధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ్‌ను వివరణ కోరగా, ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్నిరకాల మందులు సరఫరా చేస్తున్నామని, కుక్క, పాముకాటుకు సంబంధించిన మందులు కూడా అందిస్తున్నామన్నారు. బయటి మార్కెట్‌లో మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ విషయమై విచారణ జరిగిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు.

43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాపై భానుడి ప్రతాపం

నల్లగొండ, ఏప్రిల్ 1: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యప్రతాపంతో ప్రజలు విలవిలాడుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు జనం జంకుతున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో 43.0 డిగ్రీలు, చింతపల్లి మండలం గొడకండ్లలో 37.6 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో 42.2 డిగ్రీలు, తుంగతుర్తి మండ లంలో 36.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాలలో గరిష్ఠంగా 42.2 డిగ్రీలు, వలి గొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో 37.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత

తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), చిలుకూరు, నూతన్‌కల్, పెన్‌పహాడ్, అర్వపల్లి, మద్దిరాల, అనంతగిరి, ఏప్రిల్ 1: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం తుంగతుర్తి మండలంలోని తుంగతుర్తి, వెలుగుపల్లి, వెంపటి, రామన్నగూడెం తండా, గొట్టిపర్తి గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వెలుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లయి అధికారి మోహన్‌బాబుతో కలిసి ఆమె



మద్దిరాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ సురేష్

ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సిబ్బందికి సూచిం చారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు పంపించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైతు వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని తెలిపారు. ధాన్యం కొను గోళ్లలో ఎవరైన నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చామల రమణారెడ్డి, ఎంపీవో భీమ్‌సింగ్‌నాయక్, ఏపీవో నరసయ్య, వ్యవసాయాధికారి బాలకృష్ణ, ఏవో ప్రసన్న, సీసీలు యాదగిరి, నర్సింగ్ నాయక్, నర్మద, మహిళా సంఘం కమిటీ సభ్యులు, రైతులు ఉన్నారు.

● ఆత్మకూర్(ఎస్) మండలంలోని కందగట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం-ను తహసీల్దార్ వినోద్ కుమార్, చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ధ్రువకుమార్, నూతనకల్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావు, పెన్‌పహాడ్ మండం లోని మహ్మదాపురం, అనాజీపురం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో వెంకటేశ్వరరావు, అర్వపల్లి మండల కేంద్రంతో పాటు జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో ఐకేపీ



తుంగతుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం మల్లేష్, మద్దిరాల మండలంలో మండల సమాఖ్య, సంఘ బంధం ఆధ్వర్యంలో మద్దిరాల, పోలుమళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ ఏపీడీ సురేష్, అనంతగిరి మండలంలో అనంతగిరితో పాటు గోండ్రియాల గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నితహసీల్దార్ రవికు మార్, వ్యవసాయాధికారి అందె సతీష్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి ఓటేస్తే దేశం అభివృద్ధి: సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 1: బీజేపీకి ఓటేస్తేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో రామాలయాన్ని నిర్మించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. హిందూ మతాన్ని కాపాడుకోవడంత మోదీతోనే సాధ్యమని అన్నారు. నల్లగొండ ఎంపీ స్థానం నుంచి తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికే వారెంటీ లేదని అలాంటి వారు ప్రజలకు ఎలా గ్యారంటీ ఇస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ 400 ఎంపీ స్థానాలను గెలుచుకోబోతుందన్నారు. సమావేశంలో బాల వెంకటేశ్వర్లు, అంబళ్ళ నరేష్, విజయ్, వీరబాబు, అంజియాదవ్, కృష్ణయ్య, ఇంటి రవి, కోటిరెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, యల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు

ముదురుతున్న డబుల్ బెడ్‌రూం వివాదం

పెన్‌పహాడ్, ఏప్రిల్ 1: మండలంలోని చీదేళ్ల గ్రామంలో డబుల్ బెడ్‌రూం వివాదం ముదురుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామంలో 2018లో 125 ఇళ్లు నిర్మించింది. 2023 అక్టోబరు 7న 100 మంది లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మిగితా 25 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. మొత్తం ఇళ్లను మార్చి 28న ఆక్రమించుకున్నారు. వీరిలో 15మంది కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నారు. మిగిలిని వారు ఇళ్లకు తాళాలు వేసుకున్నారు. లబ్ధిదారులు, ఎంపికకానివారు కూడా ఘర్షణ పడి ఒక్కో ఇంటికి ముగ్గురు చొప్పున మూడు తాళాలు వేసుకొని ఉన్నారు. ఇళ్లు ఆక్రమించుకుంది అసలైన లబ్ధిదారులా? కాదా? అన్ని విచారణ చేయాలని తహసీల్దార్ మహేందర్‌రెడ్డి ఆర్ఐ సుందరి మట్టయ్యను గ్రామానికి ఆదివారం పంపారు. ఆర్ఐను విచారణ చేయకుండా ఇళ్ల ఆక్రమణదారులు అడ్డుకుని గ్రామం నుంచి పంపారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఈ పరిస్థితి ఎటు దారితీస్తుందోనన,ఇ అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకున్నారు.

'గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు కృషి చేయాలి'

తుంగతుర్తి, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ స్థానం నంచి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రబారి పాపారావు పార్లమెంట్ కన్వీనర్ బండారపు లింగస్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ కాప రవి, సంకినేని రవీంద్రరావు, దోనూరి వీరారెడ్డి, ఉమా మహేశ్వర్‌రావు, డాక్టర్ ప్రియదర్శిని, శ్రీనివాస్, వెంకన్న, సాయిబాబా పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీని ఓడించాలి'

గరిడేపల్లి, ఏప్రిల్ 1: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. సోమవారం మండలంలోని కీతవారిగూడెంలో పార్టీ కార్యాలయంలో జరిగిన సీపీఎం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొల్లెపల్లి శ్రీనివాస్, వెంకయ రాచమళ్ల రామస్వామి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం కోరారు. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బుల్డోజర్ వ్యవస్థను తరిమికొట్టాలన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తుందన్నారు. సమావేశంలో శీలం శ్రీను,తుమ్మకొమ్ము యోనా, మురళి, జక్కుల వెంకటేశ్వర్లు, వీరమల్లు, నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

మఠంపల్లి, ఏప్రిల్ 1: వేసవిలో గ్రామాలు, తండాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యపాండునాయక్ కోరారు. సోమవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, మాలోతు బాలునాయక్, సయ్యద్ రన్‌మియా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి రూ.100కోట్లు కేటాయించాలి

నడిగూడెం, ఏప్రిల్ 1: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించి ప్రోత్సహించాలని పకృతి వ్యవసాయ సాధకుడు, సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు.

'అవినీతిపై విచారణ జరిపించాలి'

మఠంపల్లి, ఏప్రిల్ 1: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహల్లో డైలీవేజ్ వర్కర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని మండలంలోని గుర్రంబోడుతండా, కృష్ణతండాలకు చెందిన పలువురు నాయకులు కలెక్టర్ వెంకట్రావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ దందా అంతా ఓ వ్యక్తి కనుసన్నల్లో జరుగుతోందని విచారణ జరిపించి చర్యలు తీసుకుని, అర్హులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.

గురుకుల విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డులు



అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

హుజూర్‌నగర్, చిలుకూరు, ఏప్రిల్ 1: ముంబాయికి చెందిన రంగోత్సవం సెలబ్రేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో నిర్వహించిన పోటీల్లో హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆర్ట్ విభాగంలో అంతర్జాతీయ అవార్డులు సాధించారు. వివిధ ఆర్ట్స్ విభాగాల్లో హుజూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల అధ్యాపకుడు, ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి వరల్డ్ వైడ్ హైలెవెల్ ఫెర్మాన్స్ అవార్డు సాధించారు. అదేవిధంగా గురుకుల ఆర్ట్ టీచర్ సూరేపల్లి నాగజానుకు వరల్డ్ ఫేమస్ ఆర్టిస్ట్ సెల్వర్ జోల్ డాలీ అవార్డు లభించింది. అదేవిధంగా విద్యార్థులు చడవంగు సాయినవీన్, కోలాజ్ ప్రజెంటేషన్‌కు అంతర్జాతీయ స్థాయిలో 3వ బహుమతి, కలరింగ్‌లో మంచాల నికిలేంద్ర మెరిట్ అవార్డు, జానపాటి అఖిల్ అంతర్జాతీయ మెరిట్ అవార్డు, 12 అంతర్జాతీయ మెడల్స్, 6 అంతర్జాతీయ కన్సోలేషన్ ప్రైజ్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూరిత తెలిపారు. అదేవిధంగా వివిధ విభాగాలలో కలరింగ్, టాటూ, మేకింగ్ స్కెచ్, గ్రీటింగ్ కార్డ్, మేకింగ్ కోలాజ్, ఫొటోగ్రఫీ, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్‌లో అంతర్జాతీయ అవార్డులు సాధించినట్లు తెలిపారు. కాగా రంగోత్సవం సెలబ్రేషన్స్ సంస్థ నిర్వహించిన వివిధ పోటీలలో 21 మంది విద్యార్థులు పాల్గొనగా 21 మందికి అవార్డులు లభించాయి. అదేవిధంగా అంతర్జాతీయ గ్లోబల్ స్కూల్ నుంచి అవార్డులు పొందారు. అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నందానాయక్, నాగయ్య, రాంబాబు, సురేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, సైదులు, నాగేశ్వరరావు, మధు, నాగరాజు, సుధాకర్, అనసూర్య, విజయ్‌కిరణ్ పాల్గొన్నారు.

జూనియర్ తైక్వాండ్ పోటీల్లో బాలబాలికల ఉత్తమ ప్రతిభ

హుజూర్‌నగర్: నల్లగొండ జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ తైక్వాండ్ పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన బాలబాలికలు ఉత్తమ ప్రతిభతో వివిధ రకాల పథకాలు సాధించారు. గోల్డ్ మెడల్‌ను జైవర్ధన్‌రెడ్డి, నాగచరిత, గౌతం కృష్ణ, విశ్వక్సేన, షణ్ముకప్రియలు, సిల్వర్ మెడల్‌ను నాగరోహిత్, హర్షిత్, వర్షిత్‌లు బ్రాంజ్ మెడల్‌ను కీర్తి, ఆగస్త్యలు సాధించినట్లు కోచ్ అంబేడ్కర్ తెలిపారు.

అబాకస్‌లో బంగారు పతకాలు

నడిగూడెం: మండలకేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గణితంలో ప్రతిభ చాటి అబాకస్‌లో బంగారు పతకాలు సాధించారు. విజయవాడకు చెందిన విశ్వం ఎడ్యుకేషన్ సొసైటీ మార్చి 21న పరీక్షలు నిర్వహించగా సోమవారం ఫలితాలు ప్రకటించారు. సాయి పబ్లిక్ స్కూల్‌కు చెందిన రిశీతా, ముకేస్, దీక్షిత, రూషిత్ బంగారు పతకాలు, మోక్షసాయి, పనేత్ర, శ్రీజ, ఇందులు వెండి పతకాలు, మరికొందరు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.సులోచన తెలిపారు. ప్రతిభ చాటిన విద్యారినీవిద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వీరయ్య, హర్ష, మలిక తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా క్విజ్ జాతీయ స్థాయికి ఎంపిక

కోదాడ రూరల్: ఫిట్ ఇండియా క్విజ్ జాతీయ స్థాయికి మండలంలోని కొమరబండ తేజ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. తేజ విద్యాలయానికి చెందిన 10వ తరగతి విద్యార్థి పల్లా హృతిక్, 9వ తరగతి విద్యార్థి కొండ్ర నవీన్‌కుమార్‌లు రాష్ట్ర స్థాయి ఫిట్ ఇండియా క్విజ్‌లో వంద పాయింట్లు సాధించి విజేతలుగా నిలిచారని తెలిపారు. ఏప్రిల్ చివరి వారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఫైనల్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున వీరు పాల్గొంటారన్నారు. కాగా రాష్ట్ర స్థాయి విజేతలుగా తమ పాఠశాల విద్యార్థులు రూ.2.50 లక్షల బహుమతి గెలవడం జరిగిందన్నారు. జాతీయ ఫైనల్స్‌లో గెలిచిన జట్టుకు రూ.35లక్షలు బహుమతిగా ఇస్తారని తెలిపారు.



బంగారు పతకాలతో నడిగూడెం సాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కన్నుల పండువగా బొడ్రాయి వార్షికోత్సవం



కోదాడలో బొడ్రాయి పూజల్లో పాల్గొన్న భక్తులు

కోదాడ, ఏప్రిల్ 1: కోదాడ పట్టణంలో శీత్లమాత నాభిశిల(బొడ్రాయి) ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి, జలాభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబం సమేతంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ కమిటీ సభ్యులు, ముత్యాలమ్మ కమిటీ సభ్యులు, రైతు కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వాముల విగ్రహాల ప్రతిష్ఠ

గరిడేపల్లి: మండలంలోని సర్వారం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, అభయాంజనేయ, గణపతి, శిఖర, కీర్తి ధ్వజ, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, సత్తెమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠ రెండో రోజు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ద్రోణ సుబ్రమణ్య శర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాజశేఖర్‌శర్మపాల్గొన్నారు

వైభవంగా దేవతామూర్తుల ఊరేగింపు

నేరేడుచర్ల: నేరేడుచర్లలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయంలో ప్రతిష్ఠించే కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి, జయ, విజయ విగ్రహాలను సోమవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ప్రతిష్ఠంచనున్న విగ్రహాలను మేళతాళాలతో శ్రీవాణి స్కూల్ నుంచి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. చిన్నారులు, మహిళల నృత్యాలతో పట్టణంలోని వీధుల్లో నిర్వహించిన ఊరేగింపును తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 1: సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యుల విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన నియామకాల కోసం అర్హులైన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ 19, అసిస్టెంట్ ప్రొఫెసర్ 10, సీనియర్ రెసిడెంట్ 17, ట్యూటర్ 14 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అర్హులైనవారు ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

పంటల రుణ మాఫీని వెంటనే అమలుచేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 1: రైతులకు రూ.2లక్షల పంట రుణ మాఫీని వెంటనే అమలుచేయాలిన ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో ఏవో సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌కుమార్ మాట్లాడుతూ ఎండిపోయిన వరి పైర్లను అధికారులు వెంటనే పరిశీలించి ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్,గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, ఉదయ్‌గిరి, కాకిమోహన్‌రెడ్డి, దశరథ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచాలి

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 1: ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఈవో అశోక్ అన్నారు. 'స్వీప్' కార్యాక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ వద్ద 5కేరన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటువేయాలని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

నూతన్‌కల్, ఏప్రిల్ 1: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన బింగి లింగయ్య సోమవారం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో వెన్నుపూస విరిగి తీవ్రగాయలయ్యాయి. ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. లింగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు మెంచు చక్రయ్య, తొట్ల ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్ కోరారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేతగా నరేష్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 1: తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ(ఇండియన్ నేషనల్ ట్రేడ్స్ యూనియన్ కాంగ్రెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కక్లేపల్లి నరేష్‌ను నియమించారు. సోమవారం హైదారాబాద్‌లోని ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో నరేష్‌కు నియామకపత్రాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురారి అందజేశారు. . కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సుదర్శన్‌రాజు, మీసాల ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 1: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డివిజన్ తాపీ పనివారుల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘాలకు అతీతంగా కార్మికులు ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం డివిజన్ తాపీ పనివారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వల్దాస్‌శ్రీను(రెబల్‌శ్రీను)తో పాటు కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధక్షుడు గుత్తి నగేష్, ఇరుగుదిండ్ల అంజయ్య, కోటా శ్రవణ్, కుంచం రవి, పోలగాని భిక్షంగౌడ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 1: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీవాసవిమాత సేవా సమితి, సమాచార ట్రస్టు కన్వీనర్ ఈగ దయాకర్ గుప్తా అన్నారు. శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆర్యవైశ్యవాసవీ నిత్యఅన్నదాన సత్రం వారణాసీ ట్రస్టు కమిటీలో జాయింట్ సెక్రెటరీ ఈగ దయాకర్‌గుప్తా అన్నారు. నియామకమైన ఆయనను సోమవారం సూర్యాపేటలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు మిర్యాల శివకుమార్, బొల్లం సురేష్, కోశాధికారి గుడిపాటి రమేష్, సభ్యులు నూక వెంకటేశం గుప్తా, నరేంధ్రుణి విద్యాసాగర్‌రావు, పబ్బా ప్రకాష్‌రావు, గోపారపురాజు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

నేరేడుచర్ల, ఏప్రిల్ 1: నేరేడుచర్ల పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. మునిసిపాలిటీ లోని 6, 8 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించి, భగీరథ పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పైప్‌లైన్ల పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ అశోక్‌రెడ్డి, ఏఈ స్వాతి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి గాయాలు

చివ్వెంల, ఏప్రిల్ 1: రోడ్డు ప్రమాదంలో మండలంలోని తిర్మలగిరి గ్రామ సీనియర్ పంచాయతి కార్యదర్శి నూకల కోటిరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలగిరిలో విధులు ముగించుకుని సూర్యాపేటకు బైకుపై వెళుతుండగా, వల్లభాపురం గ్రామ శివారులో జాతీయరహదారి 65పై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డికి తల, చేతులకు తీవ్రగాయాలుకాగా, చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.



సూర్యాపేట అర్బన్: హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఈ నెల ఐదో తేదీన నిర్వహించే తెలంగాణ పోగ్రెసివ్ ఆటో అండ్ మోటారు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిరణ్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ నాయకుడు ఎస్‌కే సయ్యద్, ఐఎఫ్‌టీయు జిల్లా కోశాధికారి వాజిద్ కోరారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పిడమర్తి లింగయ్య, గులాం హుస్సేన్ పద్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చివ్వెంల: బీజేపీ నాయకుడు కుంచం వంశీ మృతి బాధాకరమని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని గాయంవారిగూడెంలో విద్యుదాఘాతంతో వంశీ మృతి చెందగా, ఆయన మృతదేహంపై సైదిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.

పెన్‌పహాడ్: రిటైర్డు పోలీసు అధికారి నీలకంఠం రామకృష్ణయ్య, జోగమ్మ దంపతుల జ్ఞాపకార్థం జయరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ రవీందర్ ప్రారంభించారు.

● నల్గొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం సోమవారం నల్గొండ నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక కమిటీ సమావేశానికి పెన్‌పహాడ్ మండలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లినవారిలో యుగంధర్, మురళి, రవి తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్: భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పద్మావతిరెడ్డిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్, పట్టణ అధ్యక్షుడు ఆవుల హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, వెంకన్న, దిల్, పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా మందిర ఆవరణలో పంచగవ్య వైద్యంపై ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే అవగాహన సదస్సును విజయవంతం చేయాలని సాయిబాబా దేవాలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు.

● భవన నిర్మాణ కార్మికులకు ఐరీస్ విధానాన్ని అమలు చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలక సోమయ్య కోరారు.పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు నిర్మాణ పనులు చేస్తున్నందున వేలిముద్రలు పడడం లేదన్నారు. దీంతో కార్మికుల కార్డులు పొందాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు కార్యక్రమంలో వెంకన్న, రాంబాబు, రాముడు, రామకృష్ణ, సూర్యనారాయణ, పద్మ, చారి, రాకేష్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ పాలేటి రామారావు, సూరిశెట్టి బసవయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిర సెంటరులో వారు మాట్లాడారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ పార్టీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముల్కలపల్లి రాంబాబు, అమర్, భూక్యా నగేష్, జగన్‌నాయక్, సుందరయ్య, కవిత, సాయిరామ్‌గౌడ్, పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 104 ఉద్యోగులు చాలీచాలని వేతనా లతో ఎన్నో ఏళ్లగా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వనందున వారి కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం, వెంకట్ పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేతంలో సోమవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

పాలకవీడు: ప్రజలకు తాగు, సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గోపాల్ అన్నారు. రూ.180 కోట్లతో మండలంలోని గుండెబోయినగూడెంలో నిర్మించనున్న లిఫ్ట్ పనులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఈ లిఫ్ట్ ద్వారా పాలకవీడు మండలంలో 50శాతం ప్రజలకు తాగు, సాగు నీరందుతుందని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో లిఫ్ట్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, మోతీలాల్, నర్సింహారావు, పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో అర్చకుడు తూమాటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 140ఆవులతో నిర్వహించే గోశాలకు మఠంపల్లికి చెందిన చింతల సంధ్యారాణి కుమార్తె చరితశ్రీ, కుమారుడు భార్గవ్‌సాయి రూ.7వేల విలువైన గడ్డిని సోమవారం అందజేశారు.

కోదాడ రూరల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బుడిగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం: కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏపూరి సుధీర్ విమర్శించారు. నడిగూడెంలో అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలు ఎదుట సోమవారం నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాగరాజు, వీరచారి, గోపీనాథ్, మురళి, రవి, విజయ్ పాల్గొన్నారు.

● నీరే లేక పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని బీజేపీ నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వంగవేటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను రైతులకు వర్తింపజేసి ఇచ్చి ఆదుకోవాలన్నారు.

నూతన్‌కల్: ప్రతి ఒక్కరూ భగవద్గీతను ఆచరించాలని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక గుండెపూడి కమిటీ అధ్యక్షుడు కుమార్ అన్నారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో భగవద్గీత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సుజాత, బారతి, ఇందు, మమత, శివ, ఉమేష్, శివ వరప్రసాద్,పాల్గొన్నారు.

మద్దిరాల: రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి అన్నారు. మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ పశువైద్యాధికారి వెంకన్న, మండల పశువైద్యాదికారి ఆసీఫా పాల్గొన్నారు.

నూతన్‌కల్: మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పాల్వాయి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులపై, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై కిషోర్‌కుమార్‌ను ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. సమావేశంలో రాము, వెంకన్న, బుచ్చిరాములు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కడారి లింగయ్య కోరారు. సోమవారం మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడారు. యాసంగి ధాన్యం రైతుల ఇళ్లకు వస్తున్నా, మార్కెట్‌లో మద్దతు ధర రావడం లేదని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు మద్దతు ధర చెల్లించాలన్నారు. ఈ ఏడాది వర్షాభావంతో పైర్లు ఎండిపోయినందున ప్రభుత్వం రైతులకు క్వింటాల్ ధాన్యానికి రూ.500బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటయ్య, సత్తయ్య, ఉప్పలయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.